సాక్షి పల్నాడు

గురువారం । 26 । జనవరి । 2023



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.4733 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు దిగువకు 4,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2,216 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,179 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. ఎక్కడా మరణాలు సంభవించ లేదు.

న్యూస్‌రీల్

స్టెప్ సీఈఓగా పల్లవి




గుంటూరు వెస్ట్: యువజన సర్వీసుల శాఖ స్టెప్ సీఈఓగా ఎస్.పల్లవి బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మెప్మా పీడీ వెంకట నారాయణ స్టెప్ సీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. పల్లవికి కార్యాలయ సిబ్బంది, కోచ్‌లు, క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు.

1,08,337 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,08,337 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,04,448 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 65,158 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 570.30 అడుగుల వద్ద ఉంది. ఇది 257.3281 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,500, ఎడమ కాలువకు 8,367, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 29,610, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 50,597 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి 50,597 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 842.90 అడుగుల వద్ద ఉంది. ఇది 66.4171 టీఎంసీలకు సమానం.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.10 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ. 2.10 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను బుధవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 16 రోజులకు గాను 38 హుండీల ద్వారా రూ.2,10,31,198ల నగదుతోపాటు 393 గ్రాముల బంగారం, 4.834 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. ఇక ఈ-హుండీ ద్వారా రూ. 70,593 విరాళాలు దేవస్థానానికి భక్తులు సమర్పించారన్నారు. కానుకల లెక్కింపులో సేవా సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్లు జైలు

బాపట్ల: హత్యాయత్నం కేసులో విద్యుత్ లైన్‌మెన్‌కు ఐదేళ్లు జైలు శిక్ష విధిస్తూ బాపట్ల ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి సాధుబాబు బుధవారం తీర్పునిచ్చారు. బాపట్లకు చెందిన లీలా సాంబశివరావు 2017, ఏప్రిల్ 8న ఒక హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా అదే హోటల్‌కి వచ్చిన లైన్‌మెన్ రమావత్‌సితల్‌నాయక్ దాడి చేశాడు. విద్యుత్ కోతలపై సాంబశివరావు తిడుతుండగా అప్పటి వరకు కత్తితో చెట్లుకొట్టి వచ్చిన లైన్‌మెన్ రమావత్‌సితల్‌నాయక్ ఒక్కసారిగా సాంబశివరావుపై దాడి చేశాడు. తలపై ఒంటిపై బలంగా కొట్టాడు. ఈ కేసులో అప్పటి సీఐ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కేసును ఏపీపీ చారుమతి, సాక్షులను కోర్టుకు సమర్పించటంతో ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి సాధుబాబు ముద్దాయి నాయక్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు.

ఉత్సాహంగా సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభం

- ఆరంభించిన పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- తొలిరోజు మూడు మ్యాచ్‌ల నిర్వహణ
- హోరాహోరీగా తలపడిన జట్లు

SAKSHI · SAKSHI DIGITAL MEDIA GROUP · SPL SAKSHI PREMIER LEAGUE · Regional sponsor: APMDC · APMDC FOUNDATION · District sponsor: VIVA THE SCHOOL BY VVIT

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జేఎన్‌టీయూకే పాలకమండలి సభ్యుడు మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ శరీరాన్ని మనస్సుతో సమన్వయం చేసుకుని ఏకాగ్రత సాధించేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో గెలుపోటములను సమానంగా తీసుకుంటేనే జీవితంలో ఎదుగుతారని సూచించారు. తొలి రోజు మూడు మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి.

కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస కుమార్, ఎన్ఐటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరికృష్ణప్రసాద్, నిప్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, డీఎస్పీ విజయభాస్కరరావు, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఎల్.కృష్ణారెడ్డి, నిట్ కళాశాల పీడీ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. ఎంపైర్లుగా పి.అజయ్, జె.కోటేశ్వరరావు, కె.నవీన్‌రెడ్డి వ్యవహరించారు.



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి చిత్రంలో జేఎన్‌టీయూకే పాలకవర్గ సభ్యుడు మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

తొలి బోణి ఎన్‌వీఆర్ సాయితిరుమలదే



విజేత సాయితిరుమల జట్టు (ఇన్‌సెట్‌లో) సాయికుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

సాక్షి ప్రీమియర్ లీగ్ మొదటి మ్యాచ్‌లో ఎన్‌వీఆర్ సాయితిరుమల ఇంజినీరింగ్ కళాశాల జట్టు 22 పరుగుల తేడాతో నలందా ఫార్మాస్యూటికల్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన నలందా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన సాయి తిరుమల జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 101 పరుగులు చేసింది. జె.సాయికుమార్ 35 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నలందా జట్టు జట్టు నిర్ణీత పది ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 79 పరుగులు మాత్రమే చేయగలిగింది. సాయితిరుమల జట్టు బ్యాట్స్‌మెన్ సాయికుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

ఆర్‌వీఆర్‌అండ్‌జేసీ.. చేజింగ్ చేసి..



ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల జట్టు (ఇన్‌సెట్‌లో) శివాజీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

రెండో మ్యాచ్‌లో ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల జట్టు ఆరువికెట్ల తేడాతో నిప్స్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఆర్‌వీఆర్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నిప్స్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌వీఆర్‌అండ్ జేసీ జట్టు 8.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని శివాజీ 28 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్నాడు.

తిరుమల.. జయమాల



తిరుమల కళాశాల జట్టు (ఇన్‌సెట్‌లో) ప్రియతమ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

మూడో మ్యాచ్‌లో తిరుమల ఇంజినీరింగ్ కళాశాల జట్టు 21 పరుగుల తేడాతో ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. ఎన్ఆర్ఐ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన తిరుమల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 96 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎన్ఆర్ఐ జట్టు పది ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 75 పరుగులు మాత్రమే చేసింది. తిరుమల జట్టులో 19 పరుగులతోపాటు రెండు వికెట్లు తీసిన ప్రియతమ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



నరసరావుపేట: పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న రిపబ్లిక్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఉదయం 8.45 గంటలకు వేడుకలను నిర్వహించనున్నారు. కలెక్టర్, ఎస్పీలు ముఖ్యఅతిథులుగా హాజరై పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు. ప్రభుత్వ విభాగాలకు చెందిన పలు శకటాల ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రదర్శించనున్నారు. దీంతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. వచ్చే అతిథులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్టేడియంలో రెండు రోజుల నుంచి పోలీసు బలగాలు కవాతు రిహార్సల్స్‌ను నిర్వహిస్తున్నాయి. వీటిని ఎస్పీ రవి శంకర్‌రెడ్డి బుధవారం ప్రత్యేకంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మోపిదేవి(అవనిగడ్డ): మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్‌కుమార్ శర్మ, ఆలయ వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉభయదేవేరులతో ఆశీనులైన సుబ్రహ్మణ్యేశ్వరుడికి వేదపండితులు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

• రక్షకుడై పంపాడిలా..





డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ పథకం రెండో దశలో భాగంగా రూ.111.62 కోట్లతో సమకూర్చిన 165 అంబులెన్సులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. పాడిపశువుల రక్షణే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఆద్యంతం అట్టహాసంగా సాగింది.

ఓటు వజ్రాయుధం

- పల్నాడు కలెక్టర్ శివశంకర్
- వైభవంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- కొత్త ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ
- సీనియర్ ఓటర్లకు సత్కారం
- పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న కలెక్టర్ శివశంకర్, అధికారులు

నరసరావుపేట: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధమని, 18 ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరూ వినియోగించుకుని దేశ సమగ్రతను కాపాడే మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. బుధవారం పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఓటు హక్కుతో మంచి పాలకులను ఎన్నుకునే అవకాశం ఉంటుందని వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పని సరిగా పాటించాలని, ఓటు హక్కు వినియోగంపై కొత్త ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. బూత్‌లెవల్ అధికారులు, మండల ఎన్నికల నిర్వహణ అధికారులు, రెవెన్యూ డివిజనల్ ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా ఓటర్ల జాబితాను తయారు చేయాలని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. కొత్త ఓటర్లకు ఓటరు కార్డులను అందజేశారు. ఓటరు దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్నికల నిర్వహణ విధుల్లో సమర్థంగా పనిచేసిన బూతులెవల్ అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ వసంతబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య, మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకుమాను బాలహనుమంతారెడ్డి పాల్గొన్నారు.

‘హరికథాగాన కళారవ’

కోట సచ్చిదానంద శాస్త్రి

- పద్మశ్రీ అవార్డు ప్రకటనతో సర్వత్రా హర్షం
- వేదవిద్యాభ్యాసం బ్రాహ్మణకోడూరులోనే..
- గుంటూరులో స్థిరపడిన భాగవతార్

తెనాలి: హరికథ సర్వకళల సమాహారం. నృత్యం, సాహిత్యం, అభినయంలో ప్రవేశముంటేనే అందులో రాణించడం సాధ్యం. ఈ విశిష్ట కళలో తెలుగునాట ప్రసిద్ధి చెందిన హరికథకుడు కోట సచ్చిదానందశాస్త్రి భాగవతార్. ఆయన ఏడు దశాబ్దాలుగా దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలిచ్చారు. అనేక గౌరవాలను పొందారు. శతాధిక కథావారసులను తీర్చిదిద్దారు. వయసు ఎనిమిది పదులు పైబడినా ఇప్పటికీ గంటల తరబడి కథాగానం చేస్తున్న ఆయన అంకితభావం అనితరసాధ్యం. ఇన్ని ప్రత్యేకతలతోనే 2019లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, ఇప్పుడు పద్మశ్రీ పొందారు.

ఇదీ నేపథ్యం..

సచ్చిదానంద శాస్త్రి స్వస్థలం ప్రకాశం జిల్లా అద్దంకి. తల్లిదండ్రులు వెంకట శివయ్య, సుబ్బమ్మ. పురోహితుడైన తండ్రి దగ్గరే శాస్త్రి చిన్నతనంలో వేదవిద్య అభ్యసించారు. 9వ ఏటనే ఉపనయనం చేశారు. బ్రాహ్మణకోడూరులోని మధూకర వృత్తితో పమిడిమర్రు సుబ్బావధానులు దగ్గర వేదవిద్య నేర్చారు. 14 ఏళ్ల వయసులో తండ్రి మరణంతో ఐదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగబిడ్డల్లో పెద్దవాడైన సచ్చిదానందశాస్త్రికి కుటుంబ బాధ్యతలు అనివార్యమయ్యాయి. బంధువర్గంలో కళాకారులు, హరికథకులు ఉండటంతో సహజంగానే ఆసక్తి కలిగిన శాస్త్రి ఓపక్క పౌరోహిత్యం చేస్తూనే, పరిమి సుబ్రహ్మణ్య భాగవతుల రచనలు చదివి స్వయంగా కథాగానం సాధన చేశారు. తర్వాత అదే జీవనాధారమైంది. విజయవాడలో ఓగిరాల గోపాలం, తణుకులో ముసునూరు సూర్యనారాయణమూర్తి భాగవతులు, తెనాలిలో భాగవతుల అన్నపూర్ణయ్య దగ్గర తన కథాగానాన్ని మెరుగుపర్చుకుంటూ, ప్రదర్శనలిస్తూ వచ్చారు. విజయనగరంలో ఏడేళ్లపాటు ఉండి ఆంధ్ర, ఒడిశా పరిసరాల్లో కథాగానం చేశారు. 56 ఏళ్ల క్రితం గుంటూరు చేరుకుని అక్కడే స్థిరపడ్డారు.



ఉత్సవాల్లో సత్కారం అందుకుంటున్న సచ్చిదానంద శాస్త్రి(ఫైల్)

హరికథకు సరికొత్త సొబగులు

సచ్చిదానంద శాస్త్రి హరికథకు సరికొత్త సొబగులద్దారు. ముందుగా చతురోక్తులు, సరస సంభాషణలతో హరికథను ఆరంభించడం, సందర్భానుసారం భక్తిరస సినిమా పాటలు, సున్నితమైన హాస్య సంభాషణలు చొప్పించడం సచ్చిదానందశాస్త్రి ప్రత్యేకత. అందుకే ఆయనకు విపరీతమైన డిమాండ్ ఉండేది. కొన్నేళ్లపాటు నెలలో 30 రోజులూ ఆయన డైరీ ఖాళీ ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. పూర్వం బ్రాహ్మణులు, వేద పఠనం చేసినవారికే పరిమితమైన హరికథను ఇతరులకు, చదువులేని వారికీ నేర్పిన ఘనాపాటి సచ్చిదానందశాస్త్రి. విద్యనేర్పినందుకు ఆయన ఏ పారితోషికం తీసుకోలేదు. ఆయన శిష్యులంతా హరికథను వృత్తిగా చేసుకుని స్థిరపడ్డారు.

ఆకాశవాణిలో టాప్ ఏ గ్రేడ్ కళాకారుడు

సచ్చిదానంద ఆకాశవాణిలో టాప్ ఏ గ్రేడ్ ఆర్టిస్ట్. దేశంలోని ముఖ్య పట్టణాలు, పుణ్యక్షేత్రాలతోపాటు లండన్, మారిషస్ విదేశీ ప్రాంతాల్లోనూ ప్రదర్శనలిచ్చారు. కంచిలోని పరమాచార్యులు చంద్రశేఖర సరస్వతి, శృంగేరీ పీఠాధిపతి, త్రిదండి చినజీయరుస్వామి, కుర్తాళం పీఠాధిపతుల సమక్షంలో కథాగానం చేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు, ఆచార్య రంగా, పట్టాభి, నీలం సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, తెన్నేటి విశ్వనాథం వంటి ప్రముఖులు సచ్చిదానందశాస్త్రి కథాగానానికి పరవశులయ్యారని చెబుతారు.

పద్మశ్రీ అదృష్టమే



హరికథ, బుర్రకథ మనవైన కళలు. వీటిని పరిరక్షించాలి. దీనికి ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం. ‘ఆదిభట్ల’తో సహా ఏ ఒక్క హరికథకుడికీ పద్మశ్రీ అవార్డు రాలేదు. ఈ రోజు అది నాకు దక్కడం అదృష్టం. ప్రతి దేవస్థానంలో ఒక హరికథకుడిని నియమించడం, సంప్రదాయ కళారూపాల కోసం విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తే కళలు పదికాలాలపాటు పదిలంగా ఉంటాయి.

– కోట సచ్చిదానంద శాస్త్రి

కీర్తికిరీటంలో బిరుదులెన్నో..

సచ్చిదానంద శాస్త్రికి కోట్ల విజయభాస్కరరెడ్డి వీణను బహూకరిస్తే, ఎస్పీ బాలు చేతులమీదుగా అభిమానులు స్వర్ణకంకణం తొడిగారు. రాష్ట్ర ప్రభుత్వం ‘కళారత్న’తో గౌరవించింది. ‘హరికథా సామ్రాజ్య సార్వభౌమ’, ‘కథాగాన కళాకోవిద’, హరికథాగాన కళారవ’వంటి బిరుదులెన్నో ఆయన కీర్తికిరీటంలో చేరాయి. ఇటీవల విజయనగరం మహారాజా కళాశాల శతజయంత్యుత్సవాల్లో హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాసు పురస్కారంతో సచ్చిదానందశాస్త్రిని సత్కరించారు.

కోట హరికథాగాన కళాపీఠం పేరుతో ఉత్సవాలు

హరికథా త్రిమూర్తులుగా పేరొందిన ఆదిభట్ల నారాయణదాసు, పెద్దింటి సూర్యనారాయణ దీక్షిత్, పరిమి సుబ్రహ్మణ్యం భాగవతుల ఆరాధన ఉత్సవాలను గత 25 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు సచ్చిదానందశాస్త్రి. కోట హరికథాగాన కళాపీఠం పేరుతో ఈ ఉత్సవాలు జరుపుతున్నారు. ఏడు పదులు పైబడిన హరికథకులను సత్కరిస్తూ వస్తున్నారు. వచ్చే ఏడాది సూర్యనారాయణ దీక్షిత్ స్వస్థలం నరసాపురంలో నిర్వహించాలని తలపోస్తున్నట్టు సచ్చిదానందశాస్త్రి చెప్పారు.

బ్యాంకులో బంగారం మాయం



రెంటపాళ్లలోని యూనియన్ బ్యాంక్

సత్తెనపల్లి: ఉన్న కొద్దోగొప్పో బంగారం బ్యాంకులో భద్రంగా ఉంది లే.. ఇంక అమ్మాయి పెళ్లికి భయపడాల్సిన పనిలేదు. ఆలి మెడలో తళతళ మెరవాల్సిన తాళిబొట్టు తాడు.. ఎండిన మొక్కలకు ఎరువు వేయడానికి బ్యాంకులోకి వెళ్లినా ఆ అన్నదాత మోములో చిరునవ్వు మారలేదు. ఎందుకంటే బ్యాంకులో సొమ్ము ఉందంటే భద్రం. అది ఓ నమ్మకం. అయితే కొందరు ఈ నమ్మకానికి నిప్పు రాజేస్తున్నారు. అన్నదాతల సొమ్ముకు ఎసరు పెడుతున్నారు. బ్యాంకులకు మచ్చ తీసుకొస్తున్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో తాజాగా జరిగిన ఈ ఘటన రైతన్నలను కలవరానికి గురిచేస్తోంది. రెంటపాళ్ల గ్రామంలో ఆంధ్రాబ్యాంక్ ఇటీవల యూనియన్ బ్యాంకుగా మారింది. ఈ బ్యాంకులో సుమారు వేల సంఖ్యలో ఖాతాలు ఉన్నాయి. ఈ గ్రామంలో రైతులు అధిక సంఖ్యలో బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి వ్యవసాయానికి రుణం తీసుకుంటారు. అయితే తాజాగా ఈ బ్యాంకులో పనిచేసే గోల్డ్ అప్రయిజర్ ఇమ్మిడిశెట్టి సంపత్ కుమార్ బంగారాన్ని భద్రపరచాల్సింది పోయి మాయం చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో బ్యాంకు సిబ్బంది ఉలిక్కిపడ్డారు. మొత్తం 43 బ్యాగ్‌లలో రూ.1.70 కోట్ల విలువ చేసే బంగారాన్ని మాయం చేశారు. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న బ్రాంచ్ మేనేజర్ రాంబాబు నాయక్, అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. బంగారాన్ని తిరిగి తీసుకురావాలని గోల్డ్ అప్రయిజర్ సంపత్ కుమార్‌కు మూడు రోజులు సమయం ఇచ్చారు. ఈ విషయం తెలిసిన రైతులు ఒకపక్క ఆందోళన వ్యక్తం చేస్తుండగా మరో వైపు స్పెన్షన్‌కు గురైన మేనేజర్ తక్షణమే బంగారం తీసుకురాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని గోల్డ్ అప్రయిజర్‌తో మొర పెట్టుకుంటున్నాడు. దీనిపై ఓ జిల్లా అధికారిని వివరణ కోరగా జరిగినది వాస్తవమేనని పేరు రాయడానికి ఇష్టపడని ఆయన ధ్రువీకరించాడు.

జనం సంతోషంగా ఉంటే పాదయాత్రలెందుకు

- మంత్రి విడదల రజని
- అచ్చంపేటలో నూతన ప్రభుత్వ భవనాలు ప్రారంభం
- మంత్రులకు భారీ ర్యాలీతో స్వాగతం


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని


గురుకులపాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి రాంబాబు

అచ్చంపేట: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలందరూ సంతోషంగా ఉన్న సమయంలో లోకేష్ పాదయాత్ర చేయడంలో అర్థం ఏమిటని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆమె అచ్చంపేటలో రూ.2.25 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి ఆమె ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో వెయ్యి బైక్‌లతో అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి రజని ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. జిల్లాలో 39 పీహెచ్‌సీలుండగా నాడు–నేడు పథకం కింద 32 పీహెచ్‌సీలను అభివృద్ధిపరిచినట్లు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయన్నారు. లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క పీహెచ్‌సీ అయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. జగనన్న చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అని చెప్పారు. గత టీడీపీ పాలన ఫెయిల్ అయిందని ప్రజలముందుకు వచ్చే అర్హత వారికి లేదన్నారు.

మళ్లీ రాష్ట్రాన్ని పాలించేది జననేత జగన్‌మోహన్‌రెడ్డే

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ వచ్చేది జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వమేనన్నారు. సింగిల్‌గా వచ్చే దమ్ములేక చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ యుద్ధాలు చేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. వారాహి అంటే అమ్మవారని, తన వాహనానికి అమ్మవారి పేరు పెట్టుకుని ఎక్కి చిందులు తొక్కడం, బూతులు తిట్టడం సబబేనా అని ప్రశ్నించారు. చంద్రబాబు మోచేతి నీళ్లు తాగే పవన్‌కళ్యాణ్‌కు సీఎం జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. సోనియా గాంధీకి ఎదురునిలబడి, చంద్రబాబు కుట్రకు 16 నెలలు జైలు పాలైనా అధైర్య పడకుండా తిరుగులేని మెజార్టీతో జగన్‌మోహనరెడ్డి చరిత్ర సృష్టించాడన్నారు. ఎవరైనా సీఎం కావాలని పాదయాత్ర చేస్తారని, లోకేక్ తండ్రి కోసమా?, తన కోసమా?, పవన్‌కళ్యాణ్ కోసమా? ఎవరికోసం పాదయాత్ర చేస్తున్నారని ప్రశ్నించారు. వార్డు మెంబరుగా గెలవడం చేతగాని వారంతా పాదయాత్రలు చేస్తే ముఖ్యమంత్రులు అయిపోతారా? అని విమర్శించారు.

అభివృద్ధి, సంక్షేమం పరుగులు..

పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ జగన్‌మోహనరెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు, నాయకుని ప్రవర్తనను కూడా ప్రజలు గమనిస్తారని తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలు అభివృద్ధి పథకాల అమలుపరుస్తున్న నంబూరు శంకరరావును మళ్లీ గెలిపించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పట్టం కట్టాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 2, 3 వారాల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెదకూరపాడు నియోజకవర్గానికి రానున్నారన్నారు. అమరావతి నుంచి, బెల్లంకొండ వరకు ట్రిబుల్ రోడ్డు మంజూరైందని, రూ.70 కోట్లతో మాదిపాడు వద్ద కృష్ణా నదిపై వారధి నిర్మించనున్నట్లు తెలిపారు. రైతులు సమృద్ధిగా వ్యవసాయం చేసుకునేందుకు రూ.250 కోట్లతో ఎత్తిపోతల పథకాలు మంజూరైనట్లు తెలిపారు. వీటన్నింటికీ సీఎం జగన్‌మోహనరెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు సాగునీరు అందించే బహత్తర కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు పైలా సోమినాయుడు, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి దంపతుల బలవన్మరణం


వెంకటేశ్వర్లు, వీరమ్మ మృతదేహాలు

రొంపిచర్ల: గోగులపాడు గ్రామానికి చెందిన ఏలూరి వెంకటేశ్వర్లు (65), ఏలూరి వీరమ్మ(57) దంపతులు బుధవారం పురుగు మందు తాగి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ సురేష్ కుమార్ మృతదేహాలను పరిశీలించారు. దంపతుల మధ్య ఏర్పడ్డ కలహాలే మృతికి కారణమని భావిస్తున్నారు. ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

- నాలుగో రోజు పోటీలకు హాజరైన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- మూడో రోజు విజేతలకు బహుమతులు అందజేత
- పోటీలను తిలకించేందుకు వేలాదిగా రైతులు, ఔత్సాహికులు హాజరు


విజేతైన ఎడ్ల జత యజమానికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి వృషభరాజాల బండలాగుడు బలప్రదర్శన పోటీలు నాలుగో రోజు రైతుల కేరింతల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. రైతు సంబరాల్లో భాగంగా గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్‌పై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలను బుధవారం రాత్రి వరకు నిర్వహించారు. ఆరుపళ్ల గిత్తల విభాగానికి హాజరైన ఎద్దుల యజమానులకు ఎమ్మెల్యే గోపిరెడ్డి షీల్డు, కిట్‌లను అందజేశారు. పోటీల్లో పాల్గొంటున్న 17 ఎడ్ల జతల యజమానులను అభినందించి పోటీలను తిలకించారు. దీంతో పాటు మంగళవారం మూడో రోజు నిర్వహించిన నాలుగు పళ్ల విభాగంలో విజేతలైన వారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి ముప్పాళ్ల మండలం మద్దిరాలకు చెందిన పుచ్చకాయల శేషాదిచౌదరి ఎడ్ల జత గెల్చుకోగా, నరసరావుపేట మండలం దొండపాడు గ్రామానికి చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ ఎడ్ల జత ద్వితీయ బహుమతిని, విజయవాడకు చెందిన వల్లభనేని మోహనరావు ఎడ్ల జత తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. 17ఎడ్ల జతల్లో పదింటికి అవి నిర్ణయించిన సమయంలో బండలాగిన దూరాన్ని బట్టి స్థానాలను నిర్ణయించి బహుమతులను అందజేశారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి వేలాదిగా రైతులు, ఔత్సాహికులు తరలిరావడంతో స్టేడియం సందడిగా మారింది. ఈ సందర్భంగా నిర్వాహకులు, పోటీలకు సహకారం అందించిన దాతలను ఎమ్మెల్యే గోపిరెడ్డి ప్రత్యేకంగా సత్కరించారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, మద్ది రామబ్రహ్మానందరావు, నిర్వాహక కమిటీ సభ్యులు చల్లా నారపరెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, మూరే రవీంద్ర, పానుగోటి వెంకటరావు, కనకా పుల్లారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, వంపుగుడిజాన్, గాడిపర్తి సీతయ్య పోటీలను పర్యవేక్షించారు. శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి రెఫరీలుగా, సూరపునేని రాధాకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అడిషనల్ ఎస్పీగా విజయభాస్కర్‌రెడ్డి



సత్తెనపల్లి: అడిషనల్ ఎస్పీగా రామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పదోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 మందికి పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్‌గుప్తా ఈ నెల 24న ఉత్తర్వులు జారీ చేశారు. రామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి 2019 జూలై 22 నుంచి 2022 డిసెంబర్ 15 వరకు సత్తెనపల్లి డీఎస్పీగా విధులు నిర్వహించారు. 2022 డిసెంబర్ 15న మంగళగిరి డీజీపీ హెడ్ క్వార్టర్‌కు బదిలీపై వెళ్లారు. రామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి 11 రోస్టర్ పాయింట్లతో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు.

పర్యాటక ప్రదేశాల సందర్శనతో జ్ఞానం వృద్ధి

గుంటూరు వెస్ట్: ఖాళీ సమయాల్లో పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రలోని అనేక అంశాలు తెలుసుకునే అవకాశం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి టూరిజం వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు తప్పక చారిత్రక, పర్యాటక ప్రదేశాలను దర్శించాలన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జేసీ జి.రాజకుమారి, కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభం


కలెక్టర్ హిట్ : బ్యాటింగ్ చేసి సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


'ఆట'హాసం: క్రీడాకారులతో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సాక్షి మంగళగిరి బ్రాంచ్ మేనేజర్ గోపి, వీవీఐటీ కళాశాల చైర్మన్ విద్యాసాగర్‌రావు, కిట్స్ కళాశాల చైర్మన్ సుబ్బారావు తదితరులు

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE | Regional sponsor: APMDC, APMDC FOUNDATION | District sponsor: VIVA THE SCHOOL BY VVIT

- బ్యాటింగ్ చేసి ఆరంభించిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- కలెక్టర్‌కు బౌలింగ్ చేసిన కిట్స్ చైర్మన్ సుబ్బారావు
- తొలిరోజు మూడు మ్యాచ్‌ల షెడ్యూల్

ప్రత్తిపాడు: 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణల్లోని ఔత్సాహిక క్రికెటర్లను ప్రోత్సహించేందుకు సాక్షి మీడియా గ్రూపు సాక్షి క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహిస్తోంది. ఈ లీగ్‌ను వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఆయనకు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కె.సుబ్బారావు బౌలింగ్ చేశారు. అనంతరం జట్లను కలెక్టర్ పరిచయం చేసుకున్నారు. తర్వాత టాస్ వేసి తొలిమ్యాచ్‌ను ఆరంభించారు. ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్లుగా ఏపీఎండీసీ, వివా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు ఉన్నారు.



దేశంలోనే అత్యధికులు ఇష్టపడే ఆట

దేశంలోనే అత్యధికులు ఇష్టపడే ఆట క్రికెట్ అని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. ఈ క్రీడకు సరైన వేదికలు, మెరుగైన అవకాశాలు అందుబాటులో ఉండవని, అందుకే ఆ బాధ్యతను సాక్షి మీడియా గ్రూప్ తీసుకుని టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరగనున్న పోటీల్లో జిల్లా స్థాయిలో అనేక మంది ఔత్సాహికులు పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. ఇక్కడ గెలుపొందిన టీంలు రీజినల్, స్టేట్ లెవల్లో ఆడనున్నాయని చెప్పారు. సాక్షి నాలుగోసారి ఈ టోర్నమెంట్ నిర్వహిస్తోందని, యువతకు అమితంగా ఇష్టమైన ఈ ఆటకు సాక్షి అవకాశం కల్పించడం ఆనందించదగిన విషయమన్నారు.



యువ ప్రతిభను వెలికితీసేందుకే..

వీవీఐటీ విద్యాసంస్థల చైర్మన్ వి.విద్యాసాగర్ మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్ దోహదపడుతుందన్నారు. సాక్షి మీడియా నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో భాగస్వాములం కావడం ఆనందంగా ఉందన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ యువత రాణించాలని ఆకాంక్షించారు.




ఆహ్వానించదగిన టోర్నీ

కిట్స్ కళాశాల చైర్మన్ కె.సుబ్బారావు మాట్లాడుతూ సాక్షి ప్రీమియర్ లీగ్‌ను తమ కళాశాలలో నిర్వహించడం ఆహ్వానించదగిన విషయమన్నారు. సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సాక్షి క్రమం తప్పకుండా టోర్నమెంట్‌ను నిర్వహిస్తూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచి మేనేజర్ టి.గోపి వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

తొలి రోజు మూడు మ్యాచ్‌లు షెడ్యూల్‌లో ఉండగా, మొదటి మ్యాచ్‌లో వీవీఐటీ కళాశాల, రెండో మ్యాచ్‌లో విజ్ఞాన్ యూనివర్సిటీ బైగా నిలిచాయి.


ఇరుజట్ల క్రీడాకారులు తలపడుతున్న దృశ్యం

టీజేపీఎస్ జయకేతనం


మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన కె.శామ్యూల్

మూడో మ్యాచ్ ఎస్‌వీఆర్‌ఎం, రేపల్లె వర్సెస్ టీజేపీఎస్ కళాశాల గుంటూరు జట్ల మధ్య జరిగింది. ఎస్‌వీఆర్‌ఎం కళాశాల టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీజేపీఎస్ కళాశాల 10 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో భారీ విజయం కైవసం చేసుకుంది. 27 బంతుల్లో 48 పరుగులు (రెండు సిక్స్‌లు, ఐదు ఫోర్లు) చేసిన కె.శామ్యూల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.


విజేతగా నిలిచిన టీజేపీఎస్ కళాశాల టీం